సాగుకు కూలీల కొరత

- భారీగా పెరిగిన కూలి రేట్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


నాటు వేసేందుకు సిద్ధంగా వరినారు

రేగొండ: మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమయ్యారు. కానీ కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా వరి నాట్లు, కలుపుతీత తీసే రైతులు ఒకేసారి పనులు చేయిస్తుండడంతో కూలీల కొరత తీవ్రంగా ఏర్పడింది. అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో వరినాట్లు వేసేందుకు కూలీల రెట్లు పెరగగా సాగు పెట్టుబడి కూడా పెరిగింది. సాధారణంగా ఒక్కో కూలీకి రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.500 వరకు తీసుకుంటున్నారు.

ఆందోళనలో రైతులు

మండల వ్యాప్తంగా రైతులు వర్షాధార పంటల పైనే ఎక్కువగా ఆధారపడుతుంటారు. వానాకాలం సీజన్‌లో గతేడాది కురిసిన వర్షపాతానికి ఈసారి చాలా తక్కువగా వర్షపాతం నమోదైంది. కానీ రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు పంట సాగుపైనా దృష్టి పెట్టారు. వరి నాట్లు వేయడం, మిరప మొక్కలు నాటడం, పొలాల్లో, పత్తి పంటలలో కలుపు మొక్కలను తొలగించడానికి కూలీల అవసరం ఏర్పడింది. వరి, మిరప నాట్లు వేసేందుకు పంట పొలాలను సిద్ధం చేసిన కూలీల కొరతతో సమయానికి నాట్లు పడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరత ఒకవైపు, భారీగా పెరిగిన కూలి రేట్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదునుకు కలుపు తీయకపోవడంతో పంటను మించి కలుపు పెరిగిపోతుంది. దీంతో రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. కొంత మంది రైతులు కూలీలు దొరకక సాగు చేసిన పంటలో కలుపుతీత తీయకుండా రసాయనాలు పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే వరి నాట్లు వేసి కలుపు తీయాల్సి ఉండగా ఇంకా పూర్తిగా నాట్లే పడలేదు. నారుమళ్లు ముదిరిపోవడంతో పంట దిగుబడిపై దెబ్బపడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగు చేయడం కష్టంగా ఉంది



పంట సాగుచేయాలంటే కష్టంగా మారింది. వ్యవసాయం చేయడానికి కూలీలు కచ్చితంగా అవసరం. విత్తనాలు విత్తిన నాటి నుంచి కోత నూర్పిడి తదితర పనులకు కూలీలు ఉండాలి. రైతులంతా ఒకేసారి పంట సాగు చేయడంతో కూలీల కొరత ఏర్పడుతుంది. కూలీలకు కూలి రేట్లు పెరగడంతో పెట్టుబడి పెరిగిపోతుంది.

– కట్టస్వామి, రైతు, కొత్తపల్లిగోరి

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ శ్రీపాల్


స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీపాల్

మల్హర్: ఎరువులు, పురుగుల మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ డీలర్లను హెచ్చరించారు. మండలంలోని రుద్రారం గ్రామంలోని డీసీఎంఎస్ ఎరువుల దుకాణాన్ని మంగళవారం ఏడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను, స్టాక్ బోర్డులను, బిల్లు బుక్కులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాల ఎదుట తప్పనిసరిగా స్టాక్ బోర్డును, ధరల పట్టికను వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిని శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

‘అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..’

- యూత్ కాంగ్రెస్ నాయకుడు ప్రభుదాస్

కాటారం: మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని యూత్ కాంగ్రెస్ నాయకుడు సుందిళ్ల ప్రభుదాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని ప్రాంతంలోని రైతులకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అప్పట్లో 75 శాతం పనులు పూర్తికాగా బీఆర్ఎస్ పార్టీ అధికారంలో వచ్చి చిన్న కాళేశ్వరం పక్కన పెట్టి పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కట్టిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల బీఆర్ఎస్ నాయకులకు జేబులు నిండాయే తప్ప ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేదని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోక బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇప్పటికైన వారి పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

దొంగ ఓట్లతో గెలిచిన బీజేపీ

- టీపీసీసీ సభ్యుడు మధు


మాట్లాడుతున్న చల్లూరి మధు

భూపాలపల్లి రూరల్: బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలిచి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధు మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలోని మహదేవ్‌పూర్ నియోజకవర్గంలో 40 మందితో 6 నెలల పాటు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ టీం వర్క్ చేయించినట్లు తెలిపారు. అక్కడ వేల సంఖ్యలో దొంగ ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. ఒకే ఇంటి నంబరుపై బీజేపీ కార్యకర్త ఉండగా పదివేల ఓట్లను అక్కడ సృష్టించారని లెక్కలు కూడా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న కేంద్ర ఎలక్షన్ కమిషన్ ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నాయకులు పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, అప్పం కిషన్, అంబాల శ్రీనివాస్, ముంజల రవీందర్ గౌడ్, పద్మ, ఉడుత మహేందర్, బౌత్ విజయ్ కుమార్, బడితెల ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

‘ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రాహుల్‌గాంధీ’

చిట్యాల: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజలు వేసే ఓటు హక్కును కించపరుస్తూ దేశ ప్రతిష్టను దిగజారుస్తున్నాడని అన్నారు. దేశాన్ని విశ్వ గురువుగా చేసే ప్రయత్నం చేస్తున్న ప్రధానిమోదీ భారతదేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాడని తెలిపారు. దేశ భద్రత, విషయంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిపోయే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయాలను జీర్ణించుకోలేని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశ ప్రజలను కించపరిచేలా, దేశాన్ని ప్రపంచ దేశాల ముందు అవమానపరిచేలా ఓట్ల చోరీ పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపాడని ఆరోపించారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం


రేగొండ: మాట్లాడుతున్న వేణుగోపాల్


కాటారం: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి

టేకుమట్ల/రేగొండ: సంపూర్ణ అక్షరాస్యతే ఉల్లాస్ పథకం లక్ష్యమని భూపాలపల్లి, ములుగు జిల్లాల వయోజన విద్యా లైజన్ అధికారురి పుల్లూరి వేణుగోపాల్ అన్నారు. టేకుమట్ల, రేగొండ మండల కేంద్రాల్లో మంగళవారం వేర్వేరుగా మండలాల విద్యాధికారులు చిదిరాల సుధాకర్, వేల్పుల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బాల్యంలో పొందలేకపోయిన విద్యను వయోజనులందరికీ అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. విద్యతోనే వయోజనులు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నవభారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా రూపుదిద్దుకున్నదే ఉల్లాస్ కార్యక్రమమన్నారు. వయోజన విద్యనందుకున్న వారికి సర్టిఫికెట్లను సైతం అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలోఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: ఉల్లాస్ పథకంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఎంఈఓ కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలని గ్రామస్థాయిలో ఉన్న మహిళా సంఘాల ద్వారా చదువు రాని వారికి చదువు నేర్పించాలన్నారు. మన రాష్ట్ర భాషా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఉల్లాస్ బోధనాభ్యాసన సామగ్రి రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్ రెడ్డి, ఏపీఎం రమాదేవి, ఉపాధ్యాయులు, వీఓఏలు, మండల విద్యావనరులకేంద్రం సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌ను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలి

కాటారం: జిల్లాలో అక్షరాస్యత పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరికీ చదువు నేర్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని మండలంలో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని మండల విద్యాధికారి శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం ఉల్లాస్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీలు నరివెద్ది సత్యనారాయణ, బొల్లం సతీశ్ ఉపాధ్యాయులు, వీఓలకు కార్యక్రమ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అందించే బోధన విధానం, పద్ధతుల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మయ్య, శ్రీనివాస్, గోపి నాయక్, దేవ్‌నాయక్, రమేశ్‌నాయక్, ఏపీఎం రవీందర్, మహిళా సంఘాల సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.


టేకుమట్ల: మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్


మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న కుమారస్వామి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

చిట్యాల: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన విద్యార్థులు ఆర్థిక స్తోమత లేక దూర ప్రాంతాలకు వెళ్లి చదవలేని స్థితిలో ఉన్నారని అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే చాలా మంది విద్యార్థులు చదువుకుంటారని అన్నారు. మండలంతో పాటు మొగుళ్లపల్లి, టేకుమట్ల, రేగొండ మండలాలకు చెందిన విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మల్హర్: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


మొగుళ్లపల్లి: మొట్లపల్లిలో..


మహదేవపూర్‌లో..

- డాక్టర్ వినయ్‌భాస్కర్


కాటారం: మేడిపల్లి ఆశ్రమ పాఠశాలలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మల్హర్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వినయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని రుద్రారం పల్లె దవాఖానలో తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం డాక్టర్ వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్ష కాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ యాస్మిని వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 57 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ యాస్మిని మాట్లాడుతూ.. వర్షాకాంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికన్ గున్యా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారానికి ఒకసారి డ్రై డే పాటించాలని, ఎవరికైనా జ్వరాలు వచ్చినట్టయితే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ భిక్షపతి, సులోచన ఆశవర్కర్లు ప్రజలు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎస్టీకాలనీలో వైద్య సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్య, ఏఎన్ఎంలు హేమలత, వెంకటమ్మ, ఆశకార్యకర్తలు రుద్ర, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, దామెరకుంట గ్రామంలో మండల వైద్యాధికారిని మౌనిక ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విష జ్వరాల భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు ప్రియాంక, సుమన్, హెచ్ఈఓ స్వామి, ఎపిడమిక్ టీం సభ్యులు పరమేశ్వర్, కాపర్తి రాజు, రజిత, లక్ష్మి, పంచాయితీ కార్యదర్శి రాకేశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

కాటారం: మండలంలోని చింతకాని గ్రామానికి చెందిన సుమారు 40 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్‌కు రాజీనామా పత్రం పంపించి క్రియాశీల సభ్యత్వం నుంచి సైతం వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. పదిహేనేళ్లగా చింతకాని మాజీ సర్పంచ్ మండల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేసినట్లు వారు తెలిపారు. లక్ష్మారెడ్డి పార్టీకి రాజీనామా చేయడంతో ఆయనకు మద్దతుగా రాజీనామా చేస్తున్నట్లు వారు వివరించారు. చెన్నకేశవ్, వేల్పుల రమేశ్, అమృత సంతోష్, చకినాల రాజయ్య, ముక్కెర కొమురయ్య, పున్నంగౌడ్, రాజు, రాజయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కాళేశ్వరం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మహదేవపూర్ మండలం ఎడపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గోగుల రవీందర్ అతడి చెల్లి, అల్లుడితో కలిసి బైక్‌పై మహదేవపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్‌కు వస్తున్న కారు ఎడపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కారు నడుపుతున్న సామ్యూల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

మల్హర్‌రావు ఆశయాలు కొనసాగించాలి

- మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు


మల్హర్‌రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మల్హర్: మారుమూల ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేసిన మల్హర్‌రావు ఆశయాలను కొనసాగించాలని మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు అన్నారు. మల్హర్‌రావు జయంతిని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కొయ్యూర్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్హర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆనాడు సర్పంచ్‌గా మల్హర్‌రావు మండల అభివృద్ధికి కృషి చేశాడని గుర్తుచేశారు. జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన కొమురం భీం స్ఫూర్తితోనే మల్హర్‌రావు ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు తాజొద్దీన్, బూడిద సమ్మయ్య, మండల యూత్ అధ్యక్షుడు హరీష్, రావుల మొగిళి, రాము, హరిప్రసాద్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు


ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(వి)లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేనుకుంట్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రత్న రమాకాంత్, లద్దునూరి ప్రణయ్, వంశీ, అరవింద్, అభి, చింటు, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయండి


ధర్మానాయక్‌కు మొక్క అందజేస్తున్న రాజు

కాళేశ్వరం: మహదేవపూర్ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు కోరారు. ఈ మేరకు డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ధర్మానాయక్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. మండలం పరిధిలో గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అందుబాటులో ఉండేవిధంగా డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. దీంతో ధర్మానయక్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న భక్తులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల అభయ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకష్ట చరుర్ధశి సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుడు సిద్ధార్థ ఆధ్వర్యంలో లక్ష్మి గణపతి హోమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని వివిధ గ్రామాల మహిళా పొదుపు సంఘాలకు సార్వత్రిక విద్య వంద శాతం అక్షరాస్యత సాధించుటకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో ఇంటర్ ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. బడి మధ్యలో మానేసిన వారు, గృహిణులు, ఇతర మహిళలకు ఇది ఒక గొప్ప వరమని, ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్క రణ చేశారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు చివరి ఈనెల 18వ తేదీ వరకు ఉందన్నారు. కాగా, పూర్తి వివరాలకు 75699 75383కు ఫోన్‌లో లేదా బాలుర ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యక్షంగా సంప్రదించవచ్చని హెచ్ ఎం బి. రాజిరెడ్డి తెలిపారు.

రెండు వాహనాలు సీజ్

కాటారం: మండలంలోని మేడిపల్లి పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపు నుంచి ఇసుక తరలిస్తున్న టిప్పర్, జేసీబీని సోమవారం అర్ధరాత్రి పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్సై సుధీర్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో మేడిపల్లి సమీపంలో జేసీబీతో టిప్పర్‌లో ఇసుక నింపుతున్నట్లు గుర్తించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తేలడంతో టిప్పర్, జేసీబీని డ్రైవర్లతో సహా స్థానిక పో లీస్‌స్టేషన్‌కు తీసుకుచ్చారు. ఈ మేరకు డ్రైవర్లు సృజన్, సుమన్‌లతో పాటు ఓనర్లు భాస్కర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

మొగుళ్లపల్లి: బైక్ దొంగతనం కేసులో ఒకరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో చిట్యాల సీఐ మల్లేశ్ ఎస్సై అశోక్‌తో కలిసి మంగళవారం వివరాలను వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన రాయిశెట్టి లింగయ్య ఇంటి ముందు బైక్ ఉంచాడు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా హనుమకొండ జిల్లా నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన కంది నాగరాజు బైక్ చోరీ చేసినట్లు గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడి వద్ద రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పీసీ విజయ్‌కుమార్‌ను అభినందించి పారితోషికం అందించారు.

ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్ట్

కాటారం: మండల కేంద్రంలో ఇటీవల ఉరివేసుకొని మృతి చెందిన దుర్గం సరళ అనే వివాహిత ఆత్మహత్య కేసులో మంగళవారం ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం సరళను ఆమె కంటే తక్కువ వయసు ఉన్న జాడి రాజేశ్ అనే యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహం రాజేశ్ కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోవడంతో పాటు వారు రాజేశ్‌ను రెచ్చగొట్టడంతో సరళను వేధించడం ప్రారంభించాడు. దీంతో భర్త వేధింపులు భరించలేక సరళ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సరళ ఆత్మహత్యకు కారణమైన భర్త రాజేశ్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు జాడి శంకర్, లక్ష్మి, పిన్ని బాబాయ్‌లు జాడి తిరుపతి, గౌరిలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.